క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో యడపల్లి విద్యార్థుల ప్రతిభ



యడ్లపల్లి(వేమూరు): ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్‌ఎం కర్రా శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు ఉమ్మడి జిల్లాలోని బీఆర్ స్టేడియంలో బుధవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గుమ్మడి దీపిక 600 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 100 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించింది. బి.మేఘన 600 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. వల్లెపు వెంకట పవన్ 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించాడు. ఖాజా 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. అథ్లెటిక్స్‌లో ప్రతిభ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

704 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌సీఎం చర్చి సమీపంలోని ఓ రైస్‌మిల్లులో 704 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇందుకు బాధ్యుడైన డి..శ్రీనివాసరావుపై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ దాడులలో బాపట్ల డీఎస్‌ఓ ఈబీ విలియమ్స్, సీఎస్‌డీటీలు సత్య మంగళాంబ, నిరంజన్, శరత్, గీత తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కేంద్రం

భట్టిప్రోలు: క్విట్ ఇండియా డే సందర్భంగా కార్పొరేట్ దోపిడీ దారుల నుంచి భారతదేశాన్ని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతూ బుధవారం ప్రజా సంఘాలు తహసీల్దార్ డి.వెంకటేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా నేతృత్వంలో ఏడాది పాటు జరిగిన రైతు ఉద్యమం అనంతరం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని వెంటనే ఆ హామీలను నెరవేర్చాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, వేములపల్లి వెంకట్రామయ్య, జి.నాగరాజు, దివి శ్రీనివాసరావు, కృష్ణ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు

వెల్లటూరు(భట్టిప్రోలు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ (ఏపీసీఓఎస్టీ) ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకిడే సందర్భంగా భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం యుద్ధం వద్దు-శాంతి ముద్దు ప్రపంచ శాంతి కావాలంటూ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు యుద్ధాల వల్ల కలిగే నష్టాలను, ప్రపంచ శాంతి స్థాపన ఎలా చెయ్యాలో తదితర అంశాలపై ఉపాధ్యాయులు వివరించారు. చిత్రలేఖనం సీనియర్ విభాగంలో ఎం.నరేంద్ర, ఎస్‌కె.కరీమున్నీసా, డి.సంతోష్, జూనియర్స్ విభాగంలో పి.షారోన్, ఎస్‌కె.ఇస్రా, బి.తేజ స్వరూప్ వరప్రసాద్, క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో వై.నవ్య, సిహెచ్ నరేష్, బి.ప్రవల్లిక, సిహెచ్.నరేష్, బి.రాములు, కె.షారోన్, బి.ప్రవల్లిక, రితిక, ఎం.దుర్గా భవాని నిలిచారు. జిల్లా ఏపీసీఓఎస్టీ అకడమిక్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు, హెచ్‌ఎం కె.అరుణ కుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ సీహెచ్.సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగు నామినేషన్‌లు దాఖలు

రేపల్లె రూరల్: మండలంలోని బేతపూడి, రాజుకాల్వ, చాట్రగడ్డ పంచాయతీలలోని వివిధ కారణాలతో ఖాళీఅయిన వార్డు మెంబర్ల ఎన్నికలకు నాలుగు నామినేషన్‌లు అందాయని ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నామినేషన్‌లు స్వీకరించి అనంతరం మాట్లాడారు. బేతపూడి నుంచి డి.మార్తకుమారి, చాట్రగడ్డ నుంచి నారగాని కుమారస్వామి, పడమట సూర్యనారాయణ, రాజుకాల్వ నుంచి డి.ఆదినారాయణలు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. 10వతేదీ సాయంత్రం 5గంటలతో నామినేషన్‌ల స్వీకరణ కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువులోపు నామినేషన్‌లు దాఖలు చేసుకోవాలని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

బాపట్ల: మాల వర్గీయుల భూమిని ఇతర కులస్తులకు అక్రమంగా ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్‌ను కోరారు. చీరాల మండలం ఈపురుపాలెంలోని సర్వే నెంబరు 76/11 భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేసి వాటికి సంబంధంలేని వ్యక్తులకు ఇవ్వటంపై విచారణ చేయాలని కోరారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ

- సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానం
- గడప గడపకు మన ప్రభుత్వంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందని ఆఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో బుధవారం రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రాహేలు, పార్టీ నాయకులు బాపట్ల ఏఎంసీ డైరెక్టర్ నర్రా ధనలక్ష్మి, నర్రా శ్రీనివాసరావు, బోరుగడ్డ ఆదాం, కొర్లపాటి రాజేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని స్థానిక శాసన సభ్యులు ఇంటింటికీ వెళ్లి తెలుసుకోవడం దేశంలో ఎక్కడా లేదన్నారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలదండవేసి నివాళులర్పించారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, ఎంపీపీ బాజీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్, పార్టీ నాయకులు గోవతోటి విజయ్, బొలగాని సుబ్బారావు, బడుగు ప్రకాశరావు, చేబ్రోలు వీరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొర్లపాటి కోటయ్య, వెంకటపతిరాజు, ఎనుముల కోటేశ్వరరావు, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, మంతెన గంగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యేత్ర అశ్వినిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఐదు గ్రామాల్లో నా భూమి – నా దేశం



భట్టిప్రోలులో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగులకు సన్మానం



యాజలిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ రాంబాబు

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం, రాచూరు, భట్టిప్రోలు, చింతమోటు, పెదలంక గ్రామ పంచాయతీ కార్యాలయాలలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్-నా మట్టి - నా దేశం వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా శిలాఫలకం ప్రారంభం, పంచ ప్రాణ ప్రతిజ్ఞ, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు మాచర్ల కోటేశ్వరావు, జయవరపు రాధాకృష్ణమూర్తి, దారా రవికిరణ్మయి, గుమ్మడి శంకరరావు, భట్టిప్రోలు ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఎంఈవో-2 ఎస్.దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్ అన్నారు. మేరీ మిట్టి-మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏబీఆర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహబూబ్ సుభానీబేగ్, సెక్రటరీ రత్నశేఖర్‌లు కార్గిల్ యుద్ధ అనుభవాలను విద్యార్థులకు తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

రెండు గ్రామాల్లో...

రేపల్లె రూరల్: భవిష్య తరాలకు స్వచ్ఛతతో కూడిన బంగారు భూమిని అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ శివపార్వతి అన్నారు. నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడాయపాలెం, సింగుపాలెం సచివాలయ కేంద్రాల వద్ద, వడ్డీవారిపాలెం హైస్కూలులో బుధవారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశం కోసం తమ సర్వస్వం అర్పించి స్వాతంత్ర సమరయోధులను గౌరవించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బోరుగడ్డ డేవిడ్‌రాజును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాభూమి-నాదేశం ప్రతిజ్ఞ చేయించారు. వడ్డీవారిపాలెంలో జడ్పీహైస్కూలులో విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాతంగి రవి, వడ్డీ సునీత, ఎంఈఓ రత్నశ్రీధర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మండల కో-ఆర్డినేటర్ ఈపూరి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏపీఓ సుబ్బరాజు, ఏపీఎం త్యాగరాజు పాల్గొన్నారు.

చెరుకుపల్లి మండలంలో...

చెరుకుపల్లి: నా మట్టి-నా దేశం కార్యక్రమం ప్రతి గ్రామంలో అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రాజవోలు, తూర్పుపాలెం గ్రామాల్లో తహసీల్దార్, కుంచలవారి పాలెం, కావూరు, గ్రామాల్లో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, కనగాల గ్రామంలో ఎంఈఓ-2 నవీన్ కుమార్‌లు బుధవారం నా మట్టి నా దేశం నేల తల్లికి వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, సందర్భంగా ఆయా గ్రామాల్లో శిలాఫలకాలు ఆవిష్కరించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈఓపీఆర్డీ మురళి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం: ప్రతి ఒక్కరూ దేశ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని కర్లపాలెం ఎంపీడీఓ, బాపట్ల డీపీఓ దాసరి రాంబాబు, తహసీల్దార్ జి.కేశవనారాయణరావు తెలిపారు. బుధవారం కర్లపాలెం మండలంలోని యాజలి, దుండివారిపాలెం, బోలాయపాలెం, నాగరాజుపాలెం, దమ్మనవారిపాలెం, చింతాయపాలెం గ్రామాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నా మట్టి- నాదేశం కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా యాజలిలో డీపీవో రాంబాబు దుండివారిపాలెం గ్రామంలో తహసీల్దార్ కేశవనారాయణరావు జాతీయ జెండాలు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. విశ్రాంత సైనికులకు సన్మానం చేశారు. గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సంపద సృష్టి కేంద్రాల వద్ద మొక్కలు నాటి నీళ్లు పోశారు. సర్పంచ్‌లు నాదెండ్ల భానుప్రసాద్, పులుగు గోవిందమ్మ, కేసాని లక్ష్మి, గురపసాల వెంకటేశ్వరమ్మ, కె.శ్రీనివాసరావు, ఎంఈవో విజయశ్రీ,, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం



రేపల్లె రూరల్: మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం ఈ నెల 10వతేదీ ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.83లక్షలతో గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాలు విచ్చేస్తారని పంచాయతీ సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ సోమశేఖర్‌లు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

యాజలి(కర్లపాలెం): వృద్ధులకు చేయూత నందించటం సంతృప్తి నిస్తుందని కాపుసేన జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ తెలిపారు. కాపుసేన నాల్గవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం యాజలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాపుసేన జిల్లా అధ్యక్షుడు సిరాబంది, నాయకులు అంకమరావు, తులసికుమారి, శ్రీకృష్ణ, సురేంద్రబాబు, ఇక్కుర్తి శ్రీనివాసరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో ప్రజలందరికీ జాతీయ జెండాలు



తెనాలి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 76వ స్వాతంత్ర్య దినోత్సవాన ప్రతి ఇంటిపైనా మన జాతీయ జెండా ఎగరాలి అనే భావనతో భారత ప్రభుత్వం ×హర్ ఘర్ తిరంగా×ను ప్రవేశపెట్టినట్టు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ డీఎల్‌ఆర్‌ఎస్‌జీ ప్రసూనరెడ్డి వెల్లడించారు. ఇందుకోసమని జాతీయ జెండాలను పోస్టాఫీసుల్లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం బుధవారం స్థానిక నటరాజ్ జ్యూవెల్లరీ యాజమాన్యం 300 జాతీయ జెండాలను కొనుగోలు చేసినట్టు చెప్పారు. తెనాలి డివిజను పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉన్నాయనీ, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితో నటరాజ్ జ్యూవెల్లరీ యజమాని కొత్త మాసు కుమార్, ఎంఈ పవన్‌కుమార్, పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

యూపీఎస్సీ పరీక్షల్లో బొబ్బర్లంక యువకుడి ప్రతిభ

ఈఎస్‌ఐసీ డీడీ ఉద్యోగానికి ఎంపిక



దోవా ప్రతాప్

రేపల్లె: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపీఎస్సీ) నిర్వహించిన సెంట్రల్ గ్రూప్-ఏ సర్వీస్ పరీక్షలలో బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన నిరుపేద రైతు కూలీ దోవ కృపారావు, బసవేశ్వరిల కుమారుడు దోవ ప్రతాప్ ఓపెన్ కాంపిటీషన్‌లో 66వ ర్యాంకు సాధించి సెంట్రల్ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్సు కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ), మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్ ఇన్ సెంట్రల్ ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్సు కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దోవ ప్రతాప్ తన ప్రాథమిక విద్యను బొబ్బర్లంక ప్రభుత్వ పాఠశాలలోను, హైస్కూల్ విద్య తాడికొండ ఏపీ రెసిడెన్షియల్‌లోను, ఇంటర్, డిగ్రీ విద్యను ఆంధ్ర లయోలా కళాశాల విజయవాడలోనూ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంబీఏను ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో పూర్తి చేశాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్య ఎంబీఏ చదువుతున్న సమయంలో మెరిట్ స్కాలర్‌షిప్‌కు హెచ్‌పీసీఎల్ ద్వారా ఎంపికయ్యాడు. యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీస్ పరీక్షలలో నాలుగు సార్లు మెయిన్స్ రాసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. యూపీఎస్సీ సెంట్రల్ గ్రూప్-ఎ సర్వీసు ఎంపికకు ముందు ఎస్‌బీఐలో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా, మహారత్న కంపెనీ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌ఏఐఎల్) మేనేజర్‌గాను విధులు నిర్వహించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు, ఎమ్మెల్యే అనగాని, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ తదితరులు దోవ ప్రతాప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తెనాలిరూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తెనాలి మండలం కంచర్లపాలెం గ్రామానికి చెందిన ఆలూరి రామ్మోహన్(30) కుటుంబం మండలంలోని గుడివాడ గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్‌లోని డబ్బులు తీసుకుని మద్యం సేవిస్తూ ఉండడంతో రామ్మోహన్‌ను తల్లిదండ్రులు మందలిస్తుండేవారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం మద్యం తాగి, తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో గడ్డిమందు తాగాడు. చికిత్స పొందుతూ గుంటూరు జిల్లా వైద్యశాలలో మృతి చెందాడు. వైద్యశాల నుంచి బుధవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

దేవస్థానానికి స్టీల్ పేట్లు వితరణ

తెనాలిఅర్బన్: బాలాజీ మెటల్ స్టోర్స్ నిర్వాహకులు మాలేపాటి హేమ కుమార్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీరామేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరిగే హుండీ లెక్కింపుకు అవసరమైన స్టీల్ ప్లేట్స్‌ను బుధవారం అందించారు. దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఈఓ వీవీ రమణ కుమారి, సుబ్బారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోల తనిఖీ



తెనాలిరూరల్: బడి పిల్లలను తరలించే ఆటోలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. తెనాలి పట్టణంలో ప్రైవేటు పాఠశాలల పిల్లలను తరలించే ఆటోలను ప్రాంతీయ రవాణా అధికారి ప్రసాద్, మోటారువాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్‌ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు తమ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమూ ఆటోలో ఎక్కించుకోవాలని, డ్రైవర్ వెంబడి, వెనుక డోర్ తెరచి విద్యార్థులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్‌బాక్సులు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడన్నారు. కొద్ది రోజుల పాటు స్కూల్‌ఆటోల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు

బాపట్ల అర్బన్: బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏపీసీటీఈ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమంలో భాగంగా బుధవారం 400కు పైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతిని మనం రక్షిస్తే, ప్రకృతి మనల్ని రక్షిస్తుందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం అందరి బాధ్యత అన్నారు. వైస్ ప్రెసిడెంట్స్ దొప్పలపూడి రామోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి గెల్లి దిలీప్ కుమార్, కరస్పాండెంట్ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ తాళ్లూరి రామకృష్ణ, కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ



వెల్లటూరులో కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

వెల్లటూరు(భట్టిప్రోలు): కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. రేపల్లె కార్మిక శాఖ ఇన్‌చార్జి అధికారిణి వి.సాయి జ్యోతి పర్యవేక్షణలో నమోదు చేసిన ఈ-శ్రమ్ కార్డులను వేమూరు నియోజకవర్గ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలోని కార్మికులకు పంపిణీ చేశారు. వెంకటేశ్వరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు, ఆశా కార్యకర్తలు, చిరు వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకార కార్మికులు ఉపాధి హామీ కూలీలు, వీధి వ్యాపారులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చౌటూరి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, కార్మిక సంఘ నాయకులు ఎస్.రామకృష్ణ, ఎం.నాగయ్య, ఎం.నాగరాజు, సీహెచ్. బాబురావు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు బలవన్మరణం



పాముల నరేంద్ర (ఫైల్)

కొల్లూరు: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చిలుమూరులో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని చిలుమూరుకు చెందిన పాముల దుర్గాదేవి కుమారుడు నరేంద్ర (22) 6 నెలలుగా హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఇటీవల ఇంటికి వచ్చాడు. అప్పట్నుంచి తాను తిరిగి హైదరాబాద్ వెళ్లనని విజయవాడలో ఉద్యోగం చూసుకుంటానని తల్లితో చెపుతున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం యువకుడి తల్లి దుర్గాదేవి పొలంలో కలుపు తీసేందుకు పనికి వెళ్లింది. ఆసమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న నరేంద్ర ఇంటి దూలానికి చున్నీ కట్టి ఉరి వేసుకున్నాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో అతని స్నేహితుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వకపోవడంతో అతని ఇంటికి వెళ్లి పరిశీలించగా తలుపులు మూసి ఉన్నాయి. స్నేహితుడు కిటికీ నుంచి లోపలికి చూడటంతో ఇంటిలో ఉరి పెట్టుకుని స్థితిలో నరేంద్రను గమనించి వెంటనే తలుపులు తొలగించి అతనిని కాపాడేందుకు ప్రయత్నించాడు. ఉరి నుంచి తప్పించి మండలంలోని అనంతవరంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు అతనిని తీసుకువెళ్లడంతో పరిశీలించిన ఆర్‌ఎంపీ అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించాడు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియడం లేదని బంధువులు పోలీసులకు వెల్లడించారు. యువకుడి తల్లి బుధవారం కొల్లూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

గిరిజన హక్కులను పరిరక్షించాలి



కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం

రేపల్లె: అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని 7వ వార్డు యానాదికాలనీలో జైభీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్‌రాంజీ మాట్లాడుతూ గిరిజన హక్కులను ప్రభుత్వాలు పరిరక్షించాలని కోరారు. అనంతరం గిరిజనులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు, మండల కన్వీనర్ కర్రా బాబురావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ..

గిరిజన దినోత్సవం సందర్భంగా గ్లోరీ ఆఫ్ గుడ్‌హోప్ పబ్లిక్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం 7వవార్డులోని పలువురు గిరిజన మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాకారి దేవానందం, సభ్యుడు వేముల రామాంజనేయ ప్రసాదరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని జేఎంజే కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద పేర్కొన్నారు. మేరి మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలోని సుల్తానాబాద్, సుందరయ్య నగర్, అంగలకుదురులలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గద్దర్



గద్దర్‌కు నివాళులర్పించిన నేతల

తెనాలి: అయిదు దశాబ్దాల విప్లవ, సాంస్కృతిక ఉద్యమంలో ప్రజా వాగ్గేయకారుడుగా గద్దర్ చిరస్మరణీయమైన కృషి చేశారని బుధవారం సాయంత్రం స్థానిక గాంధీనగర్‌లోని ప్రజా నాట్యమండలి కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పలువురు నివాళులర్పించారు. విప్లవ సాంస్కృతికోద్యమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తన శరీరంలో తూటాను భరించి విప్లవోద్యమం నుంచి వైదొలగినా, ప్రజావిముక్తిబాటలో రాజకీయ పార్టీలందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అంబేద్కరిస్టుగా, బౌద్ధవిధానం స్వీకరించినా ప్రజలకోసం జీవించిన కళాకారుడిగా గద్దర్ చరిత్రలో నిలిచారని చెప్పారు. ప్రజా సాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు లోకం భాస్కరరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పి.రవికుమార్, భారత్ బచావో అధ్యక్షుడు డీఎస్ఎన్ నాగేశ్వర్, కోలా జ్యోతి తదితరులు గద్దర్‌తో తమకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు పాటలతో నివాళులర్పించారు. కనపర్తి బెన్‌హర్ పర్యవేక్షించారు.